మల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడికి జర్నలిస్టుల సన్మానం




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

దేవనగర్‌లో బీజేపీలో చేరిన పది మంది యువకులు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 250 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 04 సెప్టెంబర్ 2026

## మంత్రివర్గం నుంచి

# కొండా సురేఖ ఔట్..?

### మంత్రివర్గం నుంచి ఉద్వాసన

- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్‌కు సిఎం రేవంత్ రెడ్డి లేఖ
- సిఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు



**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో మిగతా2లో...



## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా

# నిరోధిస్తాం

● ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు ● ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం ● ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక! ● మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో మిగతా2లో...

## ఉద్యమాల ఖిల్లా నుంచే..

# గులాబీ గర్జన



**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు నీటి విడుదల షెడ్యూల్‌ను ఈ నెల 14లోపు ప్రకటించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మిగతా2లో...

## మోదీని కలిసి తెలంగాణ

# హక్కులు అడగాలి

● కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి

● బీజేపీకి మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. మిగతా2లో...

## కేబినేట్‌లో బీసీ వర్గానికి

# ప్రాధాన్యత..

● సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్ ● ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్‌గా గద్వాల విజయ లక్ష్మి ● రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ● కుడా ఛైర్ పర్సన్‌గా గుండు సుధారాణికి చాన్స్ ● బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం




## ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

- మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు
- చెన్నై నగరం వేదికగా ఒలింపిక్స్
- సీఎం విజయ్ సంచలన ప్రకటన




## 9 రోజుల్లోనే రూ.9వేల కోట్ల

# రైతుభరోసా చెల్లించాం

### - మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తమ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.36 వేల కోట్ల నిధులను రైతుభరోసా కింద రైతులకు అందించినట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ చార్జ్ షీట్ కాదని, పదేళ్ల రైతు వ్యతిరేక పాలనపై ప్రజల చార్జ్‌షీట్‌కు ఆ పార్టీ సమాధానం మిగతా2లో...

## ఎస్ఐఆర్‌లో ఆ భాద్యత మాత్రమే

# బిఎల్ఎలది: హైకోర్టు



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల్లో ధ్రువీకరించలేని తప్పుడు వివరాలకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల(బిఎల్ఏ)ను బాధ్యులుగా చేయలేమని ఢిల్లీ హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. బూత్ స్థాయి మిగతా2లో...

## నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్

# చేశారు: కొండా సురేఖ



**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తానింకా రాజీ నామా చేయలేదని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఎఐసిసి మల్లిఖార్జున ఖర్గేకు వివరణ ఇచ్చినా..తనను బలి చేయడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..అధిష్టానానికి రాసిన లేఖను విడుదల చేస్తున్నానని, తన వివరణ అడగకుండానే తనను మిగతా2లో...

# ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. “అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది” అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. “అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం” అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్..?

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే ‘షో–కాజ్ నోటీసు’ (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ–సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు.

కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానంలో కొత్త నియామకాలు చేపట్టారు.

చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు.

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

# పరకాల నుంచి సీఎం పోటీ చేయాలి

**రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా**

**నా తల్లికి అన్యాయం జరిగింది**

**బర్తరఫ్ నన్ను తీవ్రంగా బాధించింది**

**మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు**

**సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఫైర్**



**హైదరాబాద్,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత “నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను” అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, “నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను” అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

# ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

**చెన్నై,సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తమిళనాడు రాజధాని చెన్నైను ప్రపంచ స్పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. తమిళనాడు స్పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఒలింపిక్ సిటీని అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారు. దీని కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అధునాతన సౌకర్యాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి చెన్నైని ప్రపంచ ఒలింపిక్ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతేగాక ఫార్ములా వన్ రేసుల కోసం చెన్నై నగరాన్ని సిద్ధం చేస్తామన్నారు. ప్రపంచ స్థాయి మోటార్ స్పోర్ట్ పోటీలు జరిగేలా ట్రాక్‌లను నిర్మిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చెన్నైని ప్రపంచ క్రీడా నగరంగా మార్చడమే లక్షంగా ముందుకు సాగుతామని సిఎం ప్రకటించారు.

# ఉద్యమాల ఖిల్లా నుంచే.. గులాబీ గర్జన

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిత గడువులోగా షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు వేలాది మంది రైతులతో పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలో బిఆర్‌ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కెటిఆర్ విమర్శించారు. ఎన్ని తడులు నీరు విడుదల చేస్తారు.. ఎప్పుడెప్పుడు విడుదల చేస్తారు. వారబందీ విధానం అమలు చేస్తారా అనే అంశాలపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ రైతుల సాగునీటి సమస్యను పట్టించు కోవడం లేదని ఆయన ఆరోపించారు. 2003లో సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కోసం కెసిఆర్ పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు తాను కూడా పాదయాత్ర చేస్తానన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు బిఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# 9 రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతుభరోసా చెల్లించాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రైతు వినాశనం జరిగితే కాంగ్రెస్ రెండున్నరేళ్లలో రైతు వికాసం జరిగిందని ఆ ప్రకటనలో గుర్తు చేశారు.రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదన్నారు. 20142018 వరకు రైతుబంధు అనే పథకమే లేదని బీఆర్‌ఎస్ నాయకులు గుర్తు చేసుకోవాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతుబంధు ప్రారంభించిన తర్వాత కూడా ప్రతి విడత నిధుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని తెలిపారు. రూ.6 వేల కోట్లతో మొక్కజొన్న, రూ.2 వేల కోట్లతో జొన్నలు కొనుగోలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతుకు పెట్టుబడి సాయంతో పాటు 42.16 లక్షల మంది రైతులకు రైతుబీమా ద్వారా రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. రైతు బీమాతో పాటు పంటల బీమాను కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు.

# ఎస్ఐఆర్‌లో ఆ భాధ్యత మాత్రమే బిఎల్ఎలది: హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

ఏజెంట్లు ఓటరు ఫోటో వంటి ధ్రువీకరించగల సమాచారానికి మాత్రమే బాధ్యత వహిస్తారని జస్టిస్ అమిత్ బన్సాల్ పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాల్లోని అన్ని వివరాలను తాము వ్యక్తిగతంగా ధ్రువీకరించాలని హామీ ఇస్తూ బిఎల్ఎలు వ్యక్తిగత అంటర్‌టేకింగ్ ఇవ్వాలన్న నిబంధనను పిటిషనర్లు హైకోర్టులో సవాలు చేశారు. ఈ మేరకు ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, డిపిసిసి బూత్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పిటిషన్లు వేశారు. ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేసే సమాచారం మొత్తం సంబంధిత ఓటరుకే ప్రత్యేకంగా తెలిసినదని, బిఎల్ఎ పాత్ర కేవలం ఓటరుకు సహాయం చేయడానికే పరిమితమని పిటిషనర్లు వాదించారు. అందువల్ల ఆ వివరాలన్నింటినీ బిఎల్ఎ వ్యక్తిగతంగా ధ్రువీకరించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.దీనిపై హైకోర్టు విచారణ జరిపి, ఎన్యూమరేషన్ ఫారంలోని మొత్తం సమాచారానికి బిఎల్ఎను బాధ్యుడిగా చేయలేమని, ఆ సమాచారాన్ని బిఎల్ఏ ధ్రువీకరించే పరిస్థితి ఉండదని పేర్కొంది. 2002 ఓటర్ల జాబితా, తుది 2025 ఓటర్ల జాబితా ఈసిఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, లేదంటే ఈసిఐ నుంచి భౌతిక ప్రతులను పొందవచ్చని కూడా హైకోర్టు తెలిపింది. ఎస్ఐఆర్ నిర్వహణకు ఆధారంగా ఉపయోగిస్తున్న ఓటర్ల జాబితాల భౌతిక ప్రతులను పిటిషనర్లు 2026 మే వరకూ నిర్ణీత రుసుము చెల్లించి కోరవచ్చని కోర్టు పేర్కొంది.

# నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్ చేశారు: కొండా సురేఖ

(మొదటి పేజీ తరువాయి)

బర్తఫ్ చేశారని, ఎఐసిసి ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ కు కూడా నా బాధంతా చెప్పుకున్నారని తెలియజేశారు. తనకూతురు ఇండిపెండింట్.. తనతో తనకు సంబంధం లేదని.. తన ఫ్యామిలీ తనది అని కొండా సురేఖ పేర్కొన్నారు.

తన బిడ్డ మాట్లాడితే తనను బాధ్యురాలిని చేస్తున్నారని.. తానేం చేయాలి? అని ప్రశ్నించారు. రాజీనామా చేయమని తనను అడగలేదని, తాను చేయలేదని చెప్పారు. రాజకీయాల్లోకి రావాలని తనకు కోరిక ఉందని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు.

# మల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడికి జర్నలిస్టుల సన్మానం

**మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి**

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా చొరవ చూపాలి**

**జర్నలిస్టుల సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లాలి**

**జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలి**



**జేడీ మల్లంపల్లి, సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పొనుగంటి రవిని స్థానిక జర్నలిస్టులు కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం జర్నలిస్టులు మాట్లాడుతూ మండలంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పొనుగంటి రవి సహకరించాలని కోరారు. ముఖ్యంగా మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి, రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ప్రెస్‌క్లబ్ భవనం అందుబాటులో ఉంటే సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అలాగే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వంపై చొరవ తీసుకోవాలని కోరారు. ఎలాంటి జీతభత్యాలు లేకుండా సమాజ సేవలో నిరంతరం పాటుపడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పొనుగంటి రవిని కోరారు. కార్యక్రమంలో మల్లంపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# దేవనగర్‌లో బీజేపీలో చేరిన పది మంది యువకులు



**మల్లంపల్లి, సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దేవనగర్ గ్రామానికి చెందిన పది మంది యువకులు బీజేపీలో చేరారు. మండల ఉపాధ్యక్షుడు గూడెల్లి కొమురెల్లి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులకు ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మల్లంపల్లి మండల ఇన్‌చార్జి కృష్ణాకర్‌రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. వెయ్యి రోజుల ప్రజాపాలన పేరుతో రాష్ట్ర బడ్జెట్‌ను పలు రకాల స్కామ్‌లకు వేదికగా మారుస్తున్నారని విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000 పెన్షన్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతు భరోసా, రుణమాఫీ, విద్యా భరోసా కార్డు, ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12,000, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు కూలీలకు ఉపాధి హామీ తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర మంత్రులు పాలనపై దృష్టి పెట్టకుండా అవినీతి, కుంభకోణాలపై దృష్టి సారిస్తున్నారని బలరాం విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. దేవనగర్ బూత్ కమిటీ నియామకంపార్టీలో చేరిన బొమ్మర వేణి అజయ్ను దేవనగర్ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించారు. బూత్ ఉపాధ్యక్షుడిగా రాచర్ల వరుణ్, ప్రధాన కార్యదర్శిగా ముక్కామల రంజిత్ ను నియమించారు. బీజేపీలో చేరిన వారిలో గాదర వేణ, రజనీకాంత్, ఉప్పు చారి, దండిగా శ్రీధర్, గూడెల్లి హరీష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజకుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దండిగా వెంకన్న, మండల ఉపాధ్యక్షులు మచ్చిక రవి గౌడ్, బండి బాబు, జనరల్ సెక్రటరీ ఎండిగా రాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మామిడి శెట్టి రాజేందర్, సీనియర్ నాయకులు బొమ్మరాతి సారన్న, కాగితేజు చంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



**అటవీ ఉత్పత్తులతో స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెంపొందించాలి**

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు జిల్లా ఏటూరునాగారం సెప్టెంబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలో ట్రెజరీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన దుస్తుల తయారీ, జూట్ బ్యాగుల తయారీ యూనిట్లను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకుల అనుసంధానంతో వడ్డీ లేని రుణాలు అందిస్తూ స్వయం ఉపాధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. మహిళలు కుట్టు నైపుణ్యాలను నేర్చుకొని సొంతంగా యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆదాయం పొందడంతోపాటు మరి కొందరికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు రూ. 10 లక్షలతో ఆధునిక యంత్రాలను సమకూర్చినట్లు తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన, ఆదివాసీ మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలకు ఉపయోగపడే వస్తువులను తయారు చేయడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ములుగు నియోజకవర్గంలో ప్రైవేటు సంస్థల సహకారంతో సుమారు 2,000 మందికి శిక్షణ అందించినట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు మహిళా సంఘాలు, గ్రామీణాభివృద్ధి శాఖ, ఐటీడీఏ ద్వారా కుట్టు యంత్రాలు అందించే అంశంపై కృషి చేస్తున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గానికి 1,000 కుట్టు యంత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. కుట్టు శిక్షణ పూర్తిచేసిన వారి జాబితాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజన మహిళలకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా కుట్టు యంత్రాలు అందించేందుకు ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత మహిళలు తమ ఇళ్ల వద్దనే కుట్టు యంత్రాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులతోపాటు అంగన్‌వాడీ పిల్లల ఏకరూప దుస్తుల కుట్టు పనులను మహిళలకు అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. ఏకరూప దుస్తుల కుట్టు చార్జీలను పెంచాలన్న అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఇటువంటి శిక్షణ, తయారీ కేంద్రాలను మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ ప్రాంతాల్లో లభించే ఇప్పపువ్వు, తేనె, విస్తరాకుల తయారీకి ఉపయోగపడే ఆకులతో ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పపువ్వుతో లడ్డూల తయారీ వంటి కార్యక్రమాలు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. గోనెపల్లిలో తేనె ఉత్పత్తికి సంబంధించిన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక వనరులతో సొంత గ్రామాల్లోనే వ్యాపారాలు నిర్వహించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భోజనాలకు విస్తరాకులను వినియోగించాలని మంత్రి సూచించారు. మేడారం జాతర సందర్భంగా మంత్రులు, సిబ్బంది, పోలీసులతోపాటు వేలాది మందికి భోజనాలు అందించేందుకు కామారం నుంచి సేకరించిన ఆకులను ఉపయోగించినట్లు గుర్తుచేశారు. ఆకులు లభించే చెట్లను, తేనె ఉత్పత్తికి దోహదపడే అటవీ వనరులను సంరక్షించుకోవాలని సూచించారు. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఎటువంటి అటవీ ఉత్పత్తులు లభిస్తున్నాయి, వాటితో ఎలాంటి వస్తువులు తయారు చేయవచ్చనే అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఇద్దరు లేదా ముగ్గురు యువతకు అధ్యయన బాధ్యతలు అప్పగించి, స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి అవకాశాలను గుర్తించాలని సూచించారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి అనసూయ సీతక్క పదిమంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను, ఏటూరు నాగారం మండల పరిధిలోని 1,219 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో తొలిసారిగా ఎంపిక చేసిన 11 ఉత్తమ పాఠశాలలకు సంబంధించిన అవార్డులను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇన్‌చార్జి ఏపీఓ ప్రతాప్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ జనార్ధన్, ఆత్మ కమిటీ చైర్పర్సన్ రఘు , డివిజన్ చైర్పర్సన్ రవీందర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయిలో శ్రీనివాస రామానుజన్ విద్యార్థి సత్తా

- **బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో అఖిరానంద్‌కు మెరిట్ సర్టిఫికేట్**
- **వరంగల్ క్రీడా ప్రతిభను నలు దిశల చాటిన పదో తరగతి విద్యార్థి అఖిరానంద్**



**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 3: (పిసిడబ్ల్యూ న్యూస్):** క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ వరంగల్ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తమ సత్తాను చాటుతున్నారు. తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 45వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తెలంగాణ స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2026-27లో శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి ఎం. అఖిరానంద్ విశేష ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నాడు. సంగారెడ్డి జిల్లా బీహెచ్‌ఈఎల్‌లోని శ్రీ వాణి విద్యానికేతన్ హైస్కూల్ వేదికగా ఆగస్టు 28 నుంచి 30 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అఖిరానంద్ తన చురుకైన ఆటతీరు, క్రమశిక్షణతో ప్రత్యేక గుర్తింపు పొందాడు. పోటీల్లో పాల్గొన్నందుకు తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆయనకు మెరిట్ సర్టిఫికేట్ అందజేసి అభినందించింది. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ స్కూల్ నుంచి రాష్ట్రస్థాయి క్రీడాకారులు తీర్చిదిద్దడం పాఠశాల ప్రత్యేకతగా నిలుస్తోందని పలువురు క్రీడా ప్రముఖులు పేర్కొన్నారు. అఖిరానంద్ సాధించిన ఈ గుర్తింపు వరంగల్ జిల్లా క్రీడా రంగానికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత లయన్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి అఖిరానంద్‌ను అభినందిస్తూ, "ప్రతిభకు క్రమశిక్షణ, పట్టుదల జతైతే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోనూ విజయాలు సాధించడం సాధ్యమే. మా విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని పాఠశాల నిరంతరం ప్రోత్సహిస్తోంది" అని పేర్కొన్నారు. అఖిరానంద్ భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, తన పాఠశాలకు మరిన్ని విజయాలు తీసుకురావాలని క్రీడా కోచ్‌లు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.


# ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



**మల్లంపల్లి, సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆయిల్‌పామ్ పంట సాగు, ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని భూపాల్‌నగర్ గ్రామపంచాయతీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యానవన అధికారి సంజీవరావు, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, సర్పంచ్ నాగిడి రమణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి నల్లెల్ల శ్రీధర్, ఏఈఓ కావ్య, హెచ్‌ఈఓ జీవన్‌రెడ్డి, ఆత్మ సభ్యులు బిలావత్ మల్లిక, సోమశెట్టి బక్కయ్య, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు సందీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి సంజీవరావు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, అంతర పంటల సాగు, బిందు సేద్య పరికరాలపై రాయితీలు, జాతీయ వెదురు మిషన్, సెంట్రలైజ్డ్ కిచెన్ క్లస్టర్ ప్రోగ్రాం, కూరగాయల సాగు, డిజిటల్ పంటల సర్వే తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ బోరుబావుల కింద నీటి వసతి ఉన్న ప్రాంతాల్లోనే ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలను సాగు చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు చిన్న నీటి కుంటలను నిర్మించుకోవడంతో పాటు వర్షపు నీటిని ప్రతి చుక్కా సంరక్షించుకునే విధంగా రైతులు చర్యలు చేపట్టాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి నల్లెల్ల శ్రీధర్ మాట్లాడుతూ రైతులు యూరియా యాప్పై అవగాహన పెంచుకుని అవసరమైన ఎరువులను ముందుగానే బుక్ చేసుకోవాలని సూచించారు. రైతు గ్రూపుల్లో ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ వివరాలను పంపించినట్లు తెలిపారు. అలాగే రైతులు తమ పంటలను డిజిటల్ క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారులను, డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నిరంజన్, రైతులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌బాబు, వెంకట్‌రెడ్డి, మొగిలి మాధవరెడ్డి, భద్రయ్య, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జి. భద్రయ్య, శివతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# లెమర్ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**కల్లూరు, సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** లెమర్ ఎడ్యుకేషనల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలోని సెయింట్ మైఖేల్ హై స్కూల్ లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల అందమైన వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీకృష్ణుని జీవిత విశేషాలను తెలియజేసే ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ హసన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పండుగల ద్వారా పిల్లల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు విలువల పట్ల అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. కృష్ణాష్టమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

# ములుగు జిల్లాలో మీసేవ మరియు ఆధార్ సెంటర్ల వరుస తనిఖీలు

- అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్
- రేట్ చార్ట్ ప్రకారమే రుసుము తీసుకోవాలి, దరఖాస్తు దారుణతో దురుసుగా ప్రవర్తించకూడదు
- జిపిఓ మరియు ఆర్ ఐ లకు ప్రత్యేక మీసేవ మొబైల్ యాప్
- దరఖాస్తుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు




**ములుగు జిల్లా సెప్టెంబర్03( పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా గోవిందరావుపేట మరియు వెంకటాపూర్ మండలంలోని ఆధార్ మరియు మీసేవ సెంటర్లను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, డిస్ట్రిక్ట్ మేనేజర్ విజయ్ లతో కలిసి తనిఖీ చేశారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా , గోవిందరావుపేట, చల్వాయి మరియు వెంకటాపూర్ మండలంలోని పాలంపేట, కేశవాపూర్, నర్సాపూర్ & వెంకటాపూర్ గ్రామాలలోని మీసేవ మరియు ఆధార్ సెంటర్లలో తనిఖీలు చేసి.. దరఖాస్తు దారుల నుండి అధిక రుసుము వసూలు చేయద్దు అని ఆధార్ నిర్వాహకులను మరియు మీసేవ నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించారు.మీసేవ కేంద్రాలను ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి జూణ గైడ్లెన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. మీసేవ మరియు ఆధార్ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తహసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, (సదరం), బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీసేవ మరియు ఆధార్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రైతులను నిలువునా ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి ధ్వజం**

**గోవిందరావుపేటలో కాంగ్రెస్ వైఫల్య పాలనపై బిఆర్ఎస్ భారీ నిరసన ర్యాలీ**



**ములుగు జిల్లా గోవిందరావుపేట సెప్టెంబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** సాగునీరు లేక ఎండిపోతున్న పొలాలు.. యాసంగి నాటికి రైతు పరిస్థితి మరీ దారుణం పంపులు ఆన్ చేసే తెలివి లేని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక మంత్రి సీతక్క వైఫల్యంపై నిలదీత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్య పాలనకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు గారు మాట్లాడుతూ ఎండిపోతున్న పొలాలు - స్థానిక మంత్రి వ్యవసాయానికి మారుపేరైన గోవిందరావుపేట ప్రాంతంలో సాగునీరు అందక నేడు భూములు నెర్రెలు బారాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి సీతక్క గారు నిత్యం ఈ ప్రాంతంలోనే తిరుగుతున్నా, కంటిముందు ఎండిపోతున్న పంటలు కనిపించడం లేదా అని నిలదీశారు. దేవాదుల ప్రాజెక్టుపై నిర్లక్ష్యం ఉమ్మడి వరంగల్ జిల్లాకు గుండెకాయ లాంటి దేవాదుల ప్రాజెక్టులో గతంలో కేసీఆర్ గారు అదనంగా 6 పంపులు అమర్చి 4 లక్షల ఎకరాలకు నీరు అందించారని గుర్తుచేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న పంపులను నడిపే తెలివి కూడా లేదని, బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కేటీఆర్ గారు ఒత్తిడి తెస్తే తప్ప పంపులు ఆన్ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

లక్నవరం కెనాల్పై నిర్లక్ష్యం: గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం లక్నవరం కెనాల్ తవ్వకాలకు పూనుకుంటే రైతులను రెచ్చగొట్టి అడ్డుకున్న సీతక్క గారు, అధికారంలోకి వచ్చి 3 ఏళ్లవుతున్నా కనీసం 3-4 కిలోమీటర్ల కెనాల్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈరోజు కెనాల్ పూర్తయి ఉంటే లక్నవరం నిండి పొలాలు పండేవని, వానాకాలంలోనే ఇలా ఉంటే రాబోయే యాసంగిలో రైతుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీ, రైతుబంధు దగా: రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి సగం మందికి కూడా చేయకుండా అతిపెద్ద మోసానికి పాల్పడ్డారని విమర్శించారు. కేసీఆర్ గారు ఇచ్చిన రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 15,000 ఇస్తామని చెప్పి, నాలుగు విడతల డబ్బులను ఎగ్గొట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను తీవ్రంగా దగా చేసిందని మండిపడ్డారు. యూరియా కష్టాలు - సొసైటీలపై భారం గతంలో నేరుగా లభించిన యూరియా కోసం ఈరోజు రైతులు ఉదయాన్నే 5 గంటలకే లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (గ్రాూజూ) ప్రభుత్వం ఇచ్చే ట్రాన్స్పోర్ట్, లోడింగ్ ఛార్జీలను నిలిపివేసి సొసైటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. 3 ఏళ్లలో కాళేశ్వరం పూర్తి చేసిన కేసీఆర్ గారిపై కాంగ్రెస్ నాయకులు 'కూలేశ్వరం' అని దుష్ప్రచారం చేశారని, నేడు సాగునీరు అందించడం చేతకాక రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని ఆయన దుయ్యబట్టారు. పోరిక గోవింద్ నాయక్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు గారు, గోవిందరావుపేట అధ్యక్షులు లక్క వత్తు నరసింహా, తాటి కృష్ణ, మాజీ ఎంపీటీసీ చందులాల్, మోహన్ రాథోడ్, స్వరూప, రామ్,చంద్రు, సర్పంచులు సీతారామ నాయక్, గాంధీ, రాకేష్, ఎండి వలీ బాబా, ఎండి ఖాజా పాషా, తాడూ రి రఘు, కర్ర రవీందర్, ఎలవర్తి శ్రీనివాస్, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజరావు, వావిలాల పోశయ్య , కటుకూరి రాఖీ, బాస శరత్, గోవిందరా వుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్రెగుట్టల్లో ల్యాండ్మైన్ పేలుడు.. వ్యక్తి మృతి

- ఆపరేషన్ కగార్కు ముందే మావోయిస్టులు అమర్చిన బాంబులే కారణమని అనుమానం



**ములుగు జిల్లా, సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** వెంకటాపురం మండలం నూగూరు గ్రామానికి చెందిన మడకం నాగేశ్వరరావు (పేరు) ల్యాండ్మైన్ పేలుడులో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఆవులను మేపేందుకు కర్రెగుట్టల అటవీ ప్రాంతానికి వెళ్లిన నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు ల్యాండ్మైన్పై అడుగుపెట్టడంతో భారీ పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆపరేషన్ కగార్కు ముందు మావోయిస్టులు అటవీ ప్రాంతంలో అమర్చిన పేలుడు పదార్థాల్లో ఒకటి పేలి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.సమాచారం అందుకున్న నూగూరు గ్రామస్తులు అటవీ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని కాలినడకన గ్రామానికి తీసుకొచ్చారు. ఘటనపై పోలీసులు, భద్రతా బలగాలు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. అటవీ ప్రాంతంలో మరిన్ని పేలుడు పదార్థాలు ఉండే అవకాశం ఉందన్న అనుమానంతో అప్రమత్తత కొనసాగుతోంది.



# ఏజెన్సీ న్యాయస్థానాలకు అధికారాలు ఉన్నా క్రమబద్ధమైన నిర్వహణ ఏదీ?: న్యాయవాది శ్యామ్ ప్రసాద్ బజారు ప్రశ్నాస్త్రం!

**జిల్లా పాలనాధికారికి న్యాయాధికారాలు ఉన్నప్పటికీ విచారణ సమయంపై స్పష్టత కరువు!**

**ఏజెన్సీ నిబంధనల అమల్లో పర్యవేక్షణ వ్యవస్థ లోపించిందని ఆవేదన**



**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లో పౌర (సివిల్) వివాదాలను పరిష్కరించేందుకు అమల్లో ఉన్న ఏజెన్సీ నిబంధనలు-1924 ప్రకారం ప్రభుత్వ ప్రతినిధికి న్యాయాధికారాలు కల్పించినప్పటికీ, ఆ న్యాయస్థానాలు ఎప్పుడు, ఎన్ని రోజులు, ఎంతసేపు క్రమం తప్పకుండా నిర్వహించాలనే అంశంపై స్పష్టమైన నియంత్రణ వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని హైకోర్టు న్యాయవాది శ్యామ్ ప్రసాద్ బజారు పేర్కొన్నారు.జిల్లా పాలనాధికారి (కలెక్టర్) ఒకవైపు అనేక పరిపాలనా బాధ్యతలు నిర్వహిస్తూ, మరోవైపు ప్రభుత్వ ప్రతినిధిగా ఏజెన్సీ ప్రాంతాల్లో పౌర వివాదాల కేసులను విచారిస్తారు. దీంతో న్యాయ విధుల నిర్వహణకు ప్రత్యేకంగా నిర్ణయించిన విచారణ రోజులు, పనివేళలు, వివాదాల జాబితా (కాజ్-లిస్ట్) విధానం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, వాస్తవ విచారణల పర్యవేక్షణ వంటి అంశాలపై స్పష్టత అవసరమవుతోందని తెలిపారు.సాధారణ న్యాయస్థానాల విషయంలో పనివేళలు, నిర్వహణ, వివాదాల జాబితా, నివేదికల సమర్పణ వంటి అంశాలకు ప్రత్యేక నియమాలు ఉంటాయి. అయితే అవే నిబంధనలు ఏజెన్సీ న్యాయస్థానాలకు నేరుగా వర్తిస్తాయని చెప్పలేం. అందువల్ల ఈ న్యాయస్థానాలకు వర్తించే ప్రత్యేక విచారణ నియమాలు లేదా ప్రభుత్వ ఉత్తర్వులు ఏమిటో ప్రభుత్వం వెంటనే స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని న్యాయవాది శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. **ఉన్నత న్యాయస్థానం జోక్యం:** తెలంగాణ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) కూడా ఏజెన్సీ న్యాయస్థానాల పనితీరుపై పలు సందర్భాల్లో జోక్యం చేసుకుంది. 'చవాన్ ప్రకాష్' కేసులో ఏజెన్సీ నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల అధికార పరిధి, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిబంధన 57 కింద నివేదికల అంశాలను పరిశీలించింది.అదేవిధంగా 2023లో 'చాదమల్ల ఆనంద కుమారి' కేసులో ప్రభుత్వ ప్రతినిధి వద్ద పెండింగ్లో ఉన్న కేసును త్వరగా పరిష్కరించాలని ఆదేశించింది. 2026లో 'శాకుమరి తులసమ్మ' కేసులో ఆంతరంగిక దరఖాస్తు (ఇంటరిమ్ అప్లికేషన్) పదేపదే వాయిదా పడిన పరిస్థితిపై ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుని త్వరగా తేల్చాలని స్పష్టం చేసింది.ఇటీవల ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 10 (తేదీ: 03-08-2026) జారీ చేసి, 1924 ఏజెన్సీ నిబంధనలలోని మూడో నియమంలో మార్పులు చేసి ప్రస్తుతం ఉన్న తొమ్మిది జిల్లాల పేర్లను చేర్చింది. అయితే కేవలం జిల్లాల పేర్లను నవీకరించడం మాత్రమే కాకుండా, ఏజెన్సీ న్యాయస్థానాల క్రమబద్ధమైన పనితీరుకు స్పష్టమైన వ్యవస్థ అవసరమని ఆయన పేర్కొన్నారు. **ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన ముఖ్యాంశాలు:** ఏజెన్సీ న్యాయస్థానాలకు నిర్ణీత విచారణ రోజులు ఉన్నాయా? స్పష్టమైన న్యాయ విచారణ వేళలు ఉన్నాయా? వాటిని నిర్దేశించిన నియమాలు, ప్రభుత్వ ఉత్తర్వులు లేదా సమాచార పత్రాలు ఏవి? జిల్లా పాలనాధికారి పరిపాలనా విధుల్లో ఉన్నప్పుడు న్యాయ విచారణకు ప్రత్యామ్నాయ వ్యవస్థ ఏమిటి? నియమం 57 ప్రకారం వాస్తవ విచారణలు, పెండింగ్ కేసులపై క్రమం తప్పకుండా నివేదికలు సమర్పిస్తున్నారా? సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్న కేసులు, తాత్కాలిక వినతులపై పర్యవేక్షణ ఎలా జరుగుతోంది? ఇది ఏ ఒక్క జిల్లా పాలనాధికారిపై చేసిన వ్యక్తిగత ఆరోపణ కాదని, కేవలం వ్యవస్థాపరమైన ప్రశ్న అని న్యాయవాది శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. న్యాయస్థానానికి అధికారాలు కల్పించడం మాత్రమే సరిపోదని, ఆ అధికారాలు ప్రజలకు క్రమం తప్పకుండా అందుబాటులో ఉండేలా చట్టబద్ధమైన వ్యవస్థ ఉండాలని కోరారు. ఏజెన్సీ న్యాయస్థానాలు కేవలం చట్ట పుస్తకాలకే పరిమితమా లేక ప్రజలకు వాస్తవంగా అందుబాటులో ఉన్నాయా అన్నది ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు.

# ఉచిత శిక్షణతో యువత ఉద్యోగ కలలకు తోడ్పాటు

**విజయం సాధించే వరకు ప్రయత్నం చేయాలి**

**ప్రజలకు భరోసానిచ్చే పోలీస్ అధికారులుగా ఎదగాలి: మంత్రి సీతక్క**

**ములుగు జిల్లా సెప్టెంబర్03( పి సి డబ్ల్యూ న్యూస్):** నిరుద్యోగ యువత ఉద్యోగ కలలను సాకారం చేసేందుకు ఉచిత శిక్షణ ద్వారా తోడ్పాటు అందిస్తున్నామని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం ములుగు ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందనున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు తగిన ప్రోత్సాహం, శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే జిల్లా ఎస్పీతో చర్చించి ఉచిత శిక్షణ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. శిక్షణ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో పూర్తి సహకారం అందించిన జిల్లా కలెక్టర్ను అభినందించారు. టాస్క్ సౌజన్యంతో అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన విశ్వనాథ్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు.పోలీస్ ఉద్యోగాల ఎంపికలో శారీరక ప్రమాణాలు కీలకమైనందున అభ్యర్థులు కష్టపడి సిద్ధమైన తర్వాత కొలతల కారణంగా అనర్హులు కాకుండా ముందుగానే పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక శారీరక కొలతలు పరిశీలించి శిక్షణకు ఎంపిక చేసిన 250 మంది అభ్యర్థులను అభినందించారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు




మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయానికి ప్రతిభతోపాటు నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని అన్నారు. అభ్యర్థులు తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పూర్తి స్థాయిలో కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజూ తమ అభ్యసన పురోగతిని పరిశీలించుకుంటూ, నిరుత్సాహాన్ని అధిగమించి సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. గత పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించి, వాటికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సాధన చేయాలని, చదివిన అంశాలను పునశ్చరణ చేయాలని సూచించారు. ఉద్యోగం సాధించిన తర్వాత కూడా ఇదే క్రమశిక్షణ, నిలకడను కొనసాగించాలని, అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.పట్టణాలకు వెళ్లి అధిక మొత్తంలో ఖర్చు చేసి శిక్షణ పొందలేని పేద యువతకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, స్థానిక పోలీస్ అధికారుల సహకారంతో పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం 300 మంది అభ్యర్థుల శారీరక కొలతలను పరిశీలించగా, 250 మంది శిక్షణకు ఎంపికైనట్లు వెల్లడించారు. అభ్యర్థులకు అధ్యయన సామగ్రితోపాటు రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.అభ్యర్థులను రెండు బృందాలుగా విభజించి శిక్షణ ఇస్తామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి, స్థానికంగా వసతి లేని వారికి వసతి సౌకర్యం కల్పిస్తామని మంత్రి తెలిపారు. అందిస్తున్న శిక్షణకు అభ్యర్థుల సొంత సాధన, కృషి తోడైతే విజయాన్ని అందుకోగలుగుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించి కుటుంబాలకు అండగా నిలవడంతోపాటు ప్రజల రక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.డీఎస్పీ రవీందర్, ములుగు సీఐ, పసర సీఐ, పోలీస్ సిబ్బంది, అభ్యర్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖోఖో టోర్నమెంట్ ప్రారంభం







**కల్లూరు సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ చైర్మన్, ఖమ్మం జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు మాజీ డిసిసిబి చైర్మన్ మువ్వ విజయబాబు జన్మదిన పురస్కరించుకొని కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్, మట్టూరు జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్లూరు మండల హైస్కూల్ స్థాయి ఖో ఖో టోర్నమెంట్ ను కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ సహకారంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో ఏర్పాటు చేసిన మండల స్థాయి బాలుర ఖో ఖో టోర్నమెంట్ కల్లూరు మినీ స్టేడియం నందు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అందులో భాగంగా కల్లూరులో



ఖో ఖో టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరిక దృఢత్వానికి తోడ్పడుతాయని విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ఉన్నతంగా రాణించి రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తేవాలని అన్నారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కాటేపల్లి కిరణ్ కుమార్, మట్టూరు జనార్దన్ మాట్లాడుతూ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ పుట్టిన రోజుకు రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. గురువారం జరిగిన పోటీల్లో గెలుపొందిన నాలుగు ఖో ఖో జట్లకు ఆరో తారీకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల విద్యాశాఖ అధికారి పొదిలి పద్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, వైస్ చైర్మన్ శీలం కొటేశ్వరి కృష్ణారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, లక్కినేని కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆళ్ళకుంట నరసింహారావు, ఆలయ కమిటీ చైర్మన్ దారా రంగ, కాంగ్రెస్ నాయకులు ఏనుగు సత్యంబాబు, పెద్దబోయన శ్రీనివాసరావు, తక్కెలపాటి దుర్గాప్రసాద్, వేము దినాకర్, మేకల రవికుమార్, మాజీ ఎంపిటిసి కొండూరు కిరణ్ కుమార్, ఖమ్మంపాటి వీరస్వామి, యాస శ్రీకాంత్, ఏనుముల రాము, నోటి కృష్ణారెడ్డి, ఉబ్బన ప్రభాకర్ రావు, మన్నే చంటి బొజ్జయి, తోట సుబ్బారావు, గిద్దె నాగరాజు , వ్యాయామ ఉపాధ్యాయులు పసుపులేటి వీరరాఘవయ్య, మజ్జు, అస్సు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- అవంతి కళాశాలలో యాంటీ-ర్యాగింగ్ అవగాహన సదస్సు
- చట్టాలపై విద్యార్థులకు పోలీసుల దిశానిర్దేశం





**హైదరాబాద్, సెప్టెంబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):**విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ పరస్పర గౌరవంతో మెలగాలని, క్యాంపస్‌లలో ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనమవడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. బర్కత్‌పురాలోని అవంతి డిగ్రీ & పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ-ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్-ఇన్‌స్పెక్టర్లు కె. పవన్, సత్తయ్య మాట్లాడుతూ.. ర్యాగింగ్ నిరోధక చట్టాలు, వాటిని ఉల్లంఘిస్తే ఎదురయ్యే పర్యవసానాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా సోదరభావంతో ఉండాలని, కళాశాలలో ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్-ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతకు కళాశాల యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ఎస్సైలు పవన్, సత్తయ్య, లేడీ కానిస్టేబుల్ పావనిలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# "అర్హులకు అన్యాయం ఎందుకు? కుట్టు మిషన్ల పంపిణీలో పారదర్శకత ఎక్కడ?"

**- TSOBBMS ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినా పేద మహిళలకు దక్కని ప్రభుత్వ పథకం అధికారులు స్పందించాలి..**





Beneficiary Details of 'FARHEEN BEGUM (202425113976)'
INDIRAMMA MAHILA SHAKTI
(Sewing Machine Application Form)

Personal Details

| | | | |
|---|---|---|---|
| Beneficiary Id | [redacted] | Financial year | : 2024-25 |
| Name | | Aadhaar No | : XXXX-XXX |
| FSC card No./ Ration card No. | [redacted] | Father/Husband Name | : [illegible] |
| Date of Birth | [redacted] | Age | : 37 |
| Income | : 60000 | Gender | : Female |
| Martial Status | : Married | Category | : Married |
| Mobile | : [illegible] | Alternate Mobile | : [illegible] |
| Religion | : Muslim | Qualification | : 5th class and above |
| Tailoring Training undergone through | : Government | | |

Address Details

| | | | |
|---|---|---|---|
| District | : KARIMNAGAR | Constituency | : KARIMNAGAR |
| Mandal/Municipality | Karimnagar | Pachayat | : Ward no: 4 |
| Area | : URBAN | Door No | : [illegible] |
| Pin Code | : 505001 | Address for Correspondence as per Aadhaar | : [illegible] Karimnagar |

Uploads

Applicant Photograph | Tailoring Training Certificate :

Declaration

I, Certify that the above details are true and that if found incorrect , my registration is likely to be cancelled.

I hereby declared that, myself and my family members have not availed subsidy from / Government in past (5) years and in case of providing this as false, I am ready to abide by the charges of the Corporation / Government.

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీ పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కరీంనగర్ జిల్లాలోని ఫతేపురా డివిజన్ లో గల ముస్లిం శాదిఖానాలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే అర్హత ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పలువురు పేద మహిళలకు కుట్టు మిషన్లు అందకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకంపై ఆశలు పెట్టుకుని దరఖాస్తు చేసుకున్నామని, అర్హులైన ప్రతి మహిళకు న్యాయం జరిగేలా అధికారులు దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి కుట్టు మిషన్లు అందించాలని వారు కోరుతున్నారు. పేదరికంలో ఉన్న మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులకు ప్రయోజనం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు, మైనారిటీ స్కీములు అందకుండా పోవడానికి గల కారణాలను అధికారులు పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

# జన ప్రభంజనముతో దమ్మున్న నాయకుడు సండ్ర

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై**

**కల్లూరులో బీఆర్ఎస్ రైతు గర్జన**

**400 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ.. రైతుల సమస్యలపై**

**సండ్ర వెంకట వీరయ్య సమరశంఖం**

**కల్లూరు, సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు చేసిందేమీ లేదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కల్లూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ రైతు ర్యాలీ నిర్వహించారు. 400 ట్రాక్టర్లతో చెన్నూరు నుంచి కల్లూరు సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా తల్లాడ, కల్లూరు ప్రాంత రైతులకు గోదావరి జలాలను పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే అవసరమైతే ఇరిగేషన్ కార్యాలయాలను ముట్టడిస్తామనీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూరియా కోసం రైతులు రోజుల



తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని, చివరకు చెప్పులు, ఆధార్ కార్డులు లైన్లో పెట్టుకునే దుస్థితి ఏర్పడిందని సండ్ర విమర్శించారు. యూరియా కోసం యాప్ విధానం తీసుకొచ్చి రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు, రైతుబీమా, సీతారామ ప్రాజెక్టు వంటి కార్యక్రమాలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని సండ్ర పేర్కొన్నారు. కల్లూరు ప్రాంత రైతాంగానికి సాగునీరు అందుతున్నదంటే అది గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికలు, కృషి ఫలితమేనని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు 1000 రోజులు పూర్తయినా ఎందుకు అమలు చేయలేదని సండ్ర ప్రశ్నించారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, పేదలు సహా ఏ వర్గం కూడా కాంగ్రెస్ పాలనపై సంతృప్తిగా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని సండ్ర హెచ్చరించారు. ప్రజలు, రైతుల



సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, సీతారామ ప్రాజెక్టు గోదావరి జలాల కోసం అవసరమైతే ఇరిగేషన్ కార్యాలయాలను ముట్టడిస్తామని సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, లక్కినేని రఘు, మేకల కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పాలెపు రామారావు, మండల యూత్ అధ్యక్షులు మున్సిపాలిటీ కౌన్సిలర్ ల్యాబ్ అధినేత పెడకంటి రామకృష్ణ, మహమ్మద్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు కాటమనేని వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వేము కృష్ణ, కోరకొప్పు ప్రసాద్, గంగవరపు శ్రీనివాసరావు, సిహెచ్ కిరణ్, సయ్యద్ ఇంతియాజ్, రావుఫ్, బానోత్ కృష్ణ, మాజీ సర్పంచులు కళ్యాణపు కొండలరావు, నందిగం ప్రసాద్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇంటిని కూల్చి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**- విలేకరుల సమావేశంలో బాధితులు పోతనబోయిన నాగరాజు**




**ఖమ్మం,ప్రతినిధి సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** రఘునాథపాలెం మండలం ఎంపీడీవో కార్యాలయం పక్కన తమకు చెందిన 1500 గజాల ఇంటి స్థలం ఉంది. సర్వేనెంబర్ 20/ఆ/20/ఇ/20/ఈ లో ఇంటి నెంబర్ 7-173 లో ఇల్లు ఉంది. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోతనబోయిన నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ.. 2006 నుండి 2026 వరకు నలుగురు వ్యక్తులు వరుస క్రమంలో విక్రయాలు జరిపారని, వాటి లింకు డాక్యుమెంట్లతో పాటు అన్ని అర్హతలు గల డాక్యుమెంట్తో గత సంవత్సరం 2025లో అట్టి స్థలాన్ని తాము కనుగోలు చేశామని, ఈ స్థలంతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు ముద్రబోయిన వెంకటేష్, చిక్కుల రామయ్య, బానోత్ ప్రవీణ్ అలియాస్ బాలు అనే వ్యక్తులు సెప్టెంబర్ 1, 2026న అర్ధరాత్రి జెసిపి సహాయంతో ఇంటిని కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి చంపుతామని బెదిరించారని ఆరోపించారు. జరిగిన ఘటనపై రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశామని, కేసు నమోదు అయినా కూడా వారి ఆగడాలు ఆగడంలేదని నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇట్టి విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఈగ పూర్ణ, కేతు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విజయోత్సవ వేడుకలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.**

**పీసీసీ ఆదేశానుసారం దేవరుప్పుల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) పిలుపు మేరకు దేవరుప్పుల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీ జెండాలతో విజయోత్సాహాన్ని



చాటిచెప్పారు. అనంతరం స్వీట్లు పంచుకుని ప్రభుత్వ 1000 రోజుల పాలన విజయాలను ప్రజలతో కలిసి వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసంగిస్తూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమే ఈ 1000 రోజుల పాలన అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టుకుని పారదర్శకమైన, ప్రజా అనుకూలమైన పాలన అందిస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతులకు రైతు భరోసా, పంట రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు మరియు యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలులో ఉన్నాయని వివరించారు. ప్రజలపై ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అనేక రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని, రైతాంగం, మహిళలు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, యువత అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.



# బీఆర్ఎస్ నేతల రైతు ప్రేమ మొసలి కన్నీరే..

**25 లక్షల మంది రైతులకు**

**రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే**

**తుమ్మలపై విమర్శలు కాదు.. ఆయన చేసిన**

**అభివృద్ధిని చూడండి: కాంగ్రెస్ నేతలు**

**ఖమ్మం,ప్రతినిధి సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):**రైతుల సంక్షేమంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతు సంక్షోభం నుంచి రైతన్నను బయటకు తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే తట్టుకోలేకనే బీఆర్ఎస్ నేతలు విమర్శలకు దిగుతున్నారని అన్నారు.గురువారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో రైతులు, కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ చౌదరి, కమర్థపు మురళి, గుత్తా వెంకటేశ్వరరావు, రఘునాధపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవ్‌సింగ్, సహకార సంఘం అధ్యక్షుడు తాతా రఘురాం, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..**"యూరియా కొరత దేశవ్యాప్తంగా ఉంది.. తెలంగాణకే పరిమితం కాదు"** దేశవ్యాప్తంగా యూరియా కొరత ఉన్న విషయాన్ని బీఆర్ఎస్ నేతలు పక్కనపెట్టి తెలంగాణలోనే సమస్య ఉన్నట్లుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.**"రైతులకు బేడీలు వేసిన చరిత్ర ఎవరిది?"** రైతులపై బీఆర్ఎస్ నేతలు ప్రేమ ఒలకబోస్తున్నారని, అయితే వారి పాలనలో రైతుల సమస్యలు పత్రికల మొదటి పేజీల్లో వచ్చిన విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసన్నారు. "వరి వేస్తే ఉరే" అని కేసీఆర్ అన్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, 2023లో నాగార్జునసాగర్‌లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పంటలకు సాగునీరు అందించలేదని ఆరోపించారు. తమ పాలనలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. **25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నాయకులు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని విమర్శించారు. **"తుమ్మల అంటే వ్యవసాయ రంగానికి ఒక బ్రాండ్"** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన వ్యవసాయ రంగానికి ఒక బ్రాండ్‌లా పనిచేస్తున్నారని నాయకులు అన్నారు. పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని, సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. పామాయిల్ రైతులకు మరింత లాభదాయకమైన ధరలు అందేలా మంత్రి తుమ్మల పోరాడుతున్నారని, ఇది బీఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. **గోదావరి జలాలతో**





**రైతులకు సాగునీరు..** గత నెలలో 21 రోజుల పాటు జిల్లాకు గోదావరి జలాలు అందించినట్లు పేర్కొన్న నాయకులు, ఈ నెలలో కూడా 15 రోజుల పాటు గోదావరి నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. **"వెంచర్లు, ఇటుక బట్టలకు రైతుబంధు ఇచ్చింది మీరే"** బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం అమలులో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వెంచర్లు, ఇటుక బట్టలు, కొండలు, గుట్టలకు సైతం రైతుబంధు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. అదే సమయంలో యూరియా కోసం రైతులు క్యూలైన్లలో నిలబడిన విషయాన్ని కూడా ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. **"పువ్వాడ అజయ్‌కుమార్ 1000 రోజులు రైతుల కోసం ఎందుకు మాట్లాడలేదు?"** ఖమ్మం నియోజకవర్గ రైతులకు పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన మేలు ఏమిటో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వెయ్యి రోజులుగా విశ్రాంతి తీసుకుని ఇప్పుడు రైతుల పేరుతో డబ్బా కొట్టుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఇన్నాళ్లు వారి ముఖాలు, వారి అధినాయకుడి ముఖం ఎటు పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు మాత్రమే బీఆర్ఎస్ నేతలు వస్తున్నారని, ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గతంలోనే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. **"విమర్శలకు సమాధానం చెప్పేది కాదు.. పని చేసి చూపించడమే తుమ్మల నైజం"** తుమ్మల నాగేశ్వరరావు ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించరని, ఎన్ని విమర్శలు చేసినా వాటికి సమాధానం చెప్పడం కంటే తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రైతుల సంక్షేమం, సాగునీరు, పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల పట్ల నిజమైన ప్రేమ ఉంటే.. గత పాలనలో ఎందుకు పట్టించుకోలేదు? అనే ప్రశ్నకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన నా25 లక్షల మంది రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ.

**ప్రతి నియోజకవర్గానికి 6500 ఇందిరమ్మ ఇండ్లు.9 లక్షల మందికి రేషన్ కార్డులు.**

**గంగాధర సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఈరోజు 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్.43 లక్షల మందికి చేయూత పెన్షన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఎనిమిది లక్షల కోట్లతో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకు కుప్పగా మార్చిన కేసీఆర్. వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్ కే పరిమితమైన కేసీఆర్ ప్రతిపక్ష పాత్ర పోషించలేక చతికిల పడ్డ బిఆర్ఎస్.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నాయకులుఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గంగాధరలో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి టిఆర్ఎస్ పార్టీ నాయకులు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం గంగాధరలో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా





గంగాధర మండల కేంద్రం నుండి మధురానగర్ చౌరస్తా వరకు రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్, మధురానగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 1000 రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 25 లక్షల మంది రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ, ప్రతి నియోజకవర్గానికి 6500 ఇందిరమ్మ ఇండ్లు, 9 లక్షల మందికి రేషన్ కార్డులు, 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్, 43 లక్షల మందికి చేయూత పెన్షన్లు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఎనిమిది లక్షల కోట్ల అప్పుచేసి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకు కుప్పగా మార్చాలని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నాయకుడిగా వెయ్యి రోజులు అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ కేసీఆర్ పరిమితమయ్యాడని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించలేక టిఆర్ఎస్ పార్టీ చేతికిబడిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సంక్షేమం ఆగదని, వెయ్యి రోజులు కాదు, తెలంగాణ రాష్ట్రంలో పదివేల రోజులు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. 1000 రోజుల సంక్షేమ పాలన సంబరాలకు విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకు లు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఆరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, సింగిల్ విండో చైర్మన్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్యుఐ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

# ఇల్లంత కుంటలో కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవ ర్యాలీ



**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఇల్లందకుంట మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ పిలుపు మేరకు, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలతో మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి..

**• సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి • కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ టౌన్ సెప్టెంబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణ, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణపై కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్సిపల్ అధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని పలు డివిజన్లలో నివాస గృహాల మధ్య, ఇళ్ల చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రతి డివిజన్‌లో జవాన్లు, పారిశుధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి నీరు నిలిచే ఖాళీ స్థలాలను గుర్తించాలని సూచించారు. సంబంధిత స్థల యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేసి, నీరు నిల్వ కాకుండా మట్టి లేదా మొరం నింపడం, కలుపు మొక్కలు, చెత్తాచెదారం తొలగించడం, అవసరమైన చోట నీటి ప్రవాహ మార్గాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యం చేసే స్థల యజమానులపై మున్సిపల్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఖాళీ స్థలాలతో పాటు ఇళ్ల పరిసరాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, సెల్లార్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పూలకుండీలు, నీటి తొట్టెలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, కూలర్లు తదితర ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మేయర్ సూచించారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, డ్రైనేజీలు, నాలాలు, కల్వర్టుల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను ముందుగానే తొలగించి వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణలో ఎలాంటి అంతరాయం లేకుండా వాహనాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.దోమల నివారణకు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లియాంటీ లార్వా మందుల పిచికారీ, ఫాగింగ్‌లి కార్యక్రమాలను అవసరమైన మేరకు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య సమస్యలు, నీటి నిల్వకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు డివిజన్‌వారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. చేపట్టిన పారిశుధ్య పనుల వివరాలను ఫొటోలతో సహా ప్రతిరోజూ ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆదేశించారు.మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్,




ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో పనిచేసి నగరంలో ఎక్కడా నీటి నిల్వలు, చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలు పొంగిపొర్లడం వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ స్పష్టం చేశారు. అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లోనే కాకుండా అన్ని డివిజన్లలో నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ప్రజలు కూడా తమ ఇళ్లు, ఖాళీ స్థలాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సీజనల్ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు, పారిశుధ్య ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్లు సువార్థ, ఎన్.డి. అయాజ్,అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, శానిటరీ సూపర్‌వైజర్ శ్యామ్ రాజ్, వెటర్నరీ డాక్టర్ దుర్గాప్రసాద్, జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుఎన్విరాన్ మెంటల్ ఇంజినీర్లు స్వామి, రమేష్ అధికారులు పాల్గొన్నారు.

# జెన్‌జీ యువత భావి భారత నిర్మాణానికి మార్గదర్శక శక్తి

- యువత ఆలోచనలు మారితే సమాజం మారుతుంది
- యువత బాధ్యతగా ముందుకు వస్తే దేశ భవిష్యత్తు మారుతుంది
- కేసముద్రం మాజీ ఎంపీపీ శ్రీ పేరంబుదూరు వెంకటస్వామి వెల్లడించిన వివరాలు.

**తొర్రూరు ప్రతినిధి, సెప్టెంబర్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, ఏ సంవత్సరం మండలానికి చెందిన మాజీ ఎంపీపీ శ్రీ పేరంబోదూరు వెంకటస్వామి తెలిపిన వివరాలు. **జెన్ జీ యువత నిర్వచనం** జెన్ జీ (జనరేషన్ జెడ్) అనగా సాధారణంగా 1997 నుండి 2012 మధ్య జన్మించిన యువత. ఈ తరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విశ్లేషణాత్మక ఆలోచన, నిష్పక్షపాత దృక్పథం మరియు పారదర్శక నిర్ణయ సామర్థ్యంతో ప్రత్యేకతను కలిగి ఉంది. ఏ విషయాన్నైనా సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకునే ఈ తరం, భావి భారత అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలదు. **యువతకు ఆదర్శమైన మహనీయులు** చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభతో చరిత్రలో నిలిచిన మహనీయులు యువతకు మార్గదర్శకులు. ఆది శంకరాచార్యులు చిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సాధించి అద్వైత వేదాంతాన్ని ప్రచారం చేశారు. – స్వామి వివేకానంద ఆత్మవిశ్వాసం, సేవాభావంతో భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేశారు. –శ్రీనివాస రామానుజన్ గణితంలో అసాధారణ ప్రతిభతో ప్రపంచ గుర్తింపు పొందారు. – భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో త్యాగానికి ప్రతీకగా నిలిచారు. –సచిన్ టెండూల్కర్ క్రమశిక్షణ, సాధనతో ప్రపంచ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగారు. **అంతర్జాతీయ ప్రముఖులు:** అలెగ్జాండర్ ది గ్రేట్, బ్లేజ్ పాస్కల్, మేరీ క్యూరీ, లియోనెల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, మార్క్ జుకర్‌బర్గ్ వంటి వారు యువ వయస్సులోనే ప్రపంచ స్థాయి విజయాలు సాధించారు. **సారాంశం:** కలలు కనడం కాదు, వాటిని సాధించేందుకు కృషి చేసే యువతే చరిత్రను నిర్మిస్తుంది. **గ్రామాభివృద్ధిలో యువత పాత్ర** పల్లెలే దేశానికి పట్టుకొమ్మలుడ గ్రామాభివృద్ధే దేశాభివృద్ధికి పునాది." ప్రతి గ్రామంలోని జెన్ జీ యువత గ్రామ అభివృద్ధిని బాధ్యతగా స్వీకరించాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి. ప్రాథమిక సదుపాయాల పరిశీలన యువత గ్రామాల్లో క్రింది అంశాలను సమీక్షించాలి: తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం , ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాలు, వ్యవసాయ పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ సమస్యలను గుర్తించి పరిష్కార సూచనలు ఇవ్వాలి. **ప్రజా సంక్షేమ పథకాల పర్యవేక్షణ** ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరుతున్నాయా అనే విషయాన్ని యువత పరిశీలించాలి. **వారి బాధ్యతలు:** అవగాహన కల్పించడం , అర్హులకు సమాచారం అందించడం, సమస్యలను గుర్తించడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం యువత ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలి. **గ్రామ అభివృద్ధి ప్రణాళిక** ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవసరం. ఇందులో: ప్రస్తుత పరిస్థితుల అంచనా, సమస్యల గుర్తింపు, తక్షణ, దీర్ఘకాలిక అవసరాలు, నిధుల అవసరం, అమలు విధానం, పర్యవేక్షణ వ్యవస్థ , అభివృద్ధి నివేదికల సమర్పణ యువత రూపొందించిన నివేదికలను సంబంధిత అధికారులకు సమర్పించాలి: మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే పార్లమెంట్ సభ్యులు ఇది విమర్శాత్మక కార్యక్రమం కాదు; అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన నిర్మాణాత్మక ప్రయత్నం. **ముగింపు పిలుపు** సమస్యలను చూసి మౌనంగా ఉండకండిడ పరిష్కారాల కోసం ముందుకు రండి. యువత ఆలోచనలు గ్రామాలను మార్చగలవు. యువత కృషి సమాజాన్ని మార్చగలదు. యువత బాధ్యత దేశ భవిష్యత్తును నిర్మించగలదు. జెన్ జీ యువత ఆలోచనలో ఆధునికత, ఆచరణలో బాధ్యత, లక్ష్యంలో దేశాభివృద్ధి. శ్రీ పేరుంబూదూరు వెంకటస్వామి మాజీ మండల పరిషత్ అధ్యక్షులు, కేసముద్రం9440159393.

# సంత్ రవిదాస్ చిత్రపటంపై సిరా చల్లడంపై జిల్లా వ్యాప్తంగా బిజెపి ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో నిరసనలు

● ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం... బిజెపి శ్రేణుల అరెస్ట్...





**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయం,తో పాటు జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసి, ఈ సందర్భంగా కార్యాలయంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సామాజిక సంస్కర్త సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లసిరా చల్లడాన్ని నిరసిస్తూ బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపుమేరకు గురువారం రోజున కరీంనగర్ జిల్లావ్యాప్తంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి , ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. పలు ప్రాంతాల్లో బిజెపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. చొప్పదండి కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ గుండాగిరి, దౌర్జన్యాలకు పాల్పడుతుందని, దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. నల్గొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంలోకి కాంగ్రెస్ గుండాలు చొరబడి వస్తువులన్నీ ధ్వంసం చేయడమే కాకుండా ఆ సమయంలో ఇంట్లో ఉన్న వర్షిత్ రెడ్డి తల్లిపై కూడా భౌతిక దాడి చేయడంతో ఆమెకు గాయాలపాలై గుండెపోటు కూడా గురైందన్నారు. అంతేకాకుండా దాడుల సమయంలో కార్యాలయంలో ఉన్న మహనీయులు సంత్ రవిదాస్ జీ చిత్రపటంపై కాంగ్రెస్ దుండగులు నల్ల రంగు చల్లి ,ఆ మహనీయునీ ఇలా అవమానించడం తగదన్నారు . దళిత సమాజం , సమాజంలోని అన్ని వర్గాల మనోభావాలను కాంగ్రెస్ తీవ్రంగా గాయపరిచిందన్నారు. సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించిన వారిపై సమగ్ర విచారణ జరిపి, చట్ట నిబంధనల ప్రకారం ఎస్సీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. . కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, దాడులు చేసిన వారిని వదిలేసి పరామర్శించడానికి వెళ్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ను అరెస్టు చేయడం పై ఆయన మండిపడ్డారు.

**తిమ్మాపూర్‌లో దిష్టిబొమ్మ దహనం...** బిజెపి తిమ్మాపూర్ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఎలుకపెల్లి స్వామి , జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, జిల్లా ఈసీ మెంబర్ బుట్ల శ్రీనివాస్, ముప్వర పు సంపత్ మండల జనరల్ సెక్రెటరీ గొట్టిముక్కల తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనాల మోహన్ ,బీజేవైఎం మండల అధ్యక్షులు గడ్డం అరుణ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు దుర్శేడ్ రమేష్ సీనియర్ నాయకులు తమ్మన వేణి రాజు యాదవ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, వరకోలు సమ్మయ్య, వేల్పుల ఓదేలు జంగా సునీల్ రెడ్డి, జాడి రాజు, ప్రదీప్ రెడ్డి ,హరిదాస్ ,పాశం అజయ్, అనిల్ ,అజయ్ లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించండి.. సురక్షితంగా వెళ్లండి..!

● వేముల మండల ఎస్.ఐ పి.ప్రవీణ్ కుమార్

● బెస్తవారిపల్లె క్రాస్‌రోడ్డులో పోలీసుల తనిఖీలు ● నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలకు చలానాలు



**వేముల సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రహదారి భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని వేముల మండల ఎస్ఐ పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. వేముల మండల పరిధిలోని బెస్తవారిపల్లె క్రాస్‌రోడ్డులో గురువారం సాయంత్రం ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్, బీమా తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను గుర్తించి,ఆయా వాహనదారులకు చలానాలు విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగంగా ప్రయాణించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. **రోడ్డు భద్రతపై అవగాహన** చిన్నపాటి నిర్లక్ష్యం,అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని వాహనదారులకు అవగాహన కల్పించారు. **తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి** మండల పరిధిలో రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహన తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని ఎస్ఐ పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ఆగిపోతున్న గుండె, ఊపిరితిత్తులకు 'ఎకమో' ప్రాణాధార చికిత్స

- ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఎకమో ఆశాకిరణం
- సోమాజీగూడా 'యశోద' ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ డి. మధుకిరణ్



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మనిషి జీవితంలో గుండె కొట్టుకోవడం, ఊపిరి పీల్చుకోవడం అత్యంత సహజమైన ప్రక్రియలు. కానీ అనారోగ్యం కారణంగా గుండె పనిచేయడం మందగించినా, ఊపిరితిత్తులు శరీరానికి అవసరమైన ఆక్సిజన్‌ను అందించలేని పరిస్థితి ఏర్పడినా ఆ క్షణాలు కుటుంబ సభ్యులకు అత్యంత ఆందోళనకరంగా మారుతాయి. ఇలాంటి ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రాణాలను నిలబెట్టేందుకు ఆధునిక వైద్య రంగం అందిస్తున్న అత్యంత కీలకమైన చికిత్సా విధానమే ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఎకమో) అని సోమాజీగూడ యశోద ఆసుపత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ డి. మధుకిరణ్ తెలిపారు. ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ డి. మధుకిరణ్ తో పాటు డాక్టర్ వినీత్ ఇలాపురం, డాక్టర్ బి. అభిషేక్ లు మాట్లాడుతూ.. తీవ్రమైన గుండె, ఊపిరితిత్తుల వైఫల్యంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రోగులకు 'ఎకమో' ఒక ప్రాణాధార చికిత్సగా, జీవితం వైపు మరో అడుగు వేయించే ఆశావంతమైన వైద్య విధానంగా ఉపయోగపడుతుందని వివరించారు. హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల బృందం, అధునాతన చికిత్సా పద్ధతులతో ఎకమో సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎకమో చికిత్సలో ప్రత్యేకమైన కాన్యులాల ద్వారా రోగి శరీరం నుంచి రక్తాన్ని బయటకు తీసి, ప్రత్యేక ఎకమో సర్క్యూట్‌లోని మెంబ్రేన్ ఆక్సిజినేటర్ ద్వారా రక్తంలోకి ఆక్సిజన్‌ను అందిస్తారు. అదే సమయంలో కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తారు. అనంతరం ఆక్సిజన్‌తో సమృద్ధిగా ఉన్న రక్తాన్ని తిరిగి రోగి శరీరంలోకి పంపిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా కొంతకాలం పాటు ఊపిరితిత్తుల పనితీరుకు, అవసరమైన సందర్భాల్లో గుండె పనితీరుకు కూడా మద్దతు లభిస్తుంది. అంటే ప్రకృతి సహజంగా నిర్వహించాల్సిన కీలకమైన శారీరక ప్రక్రియలకు తాత్కాలికంగా అండగా నిలిచే కృత్రిమ జీవనాధార వ్యవస్థగా ఎకమో పనిచేస్తుందని వైద్యులు తెలిపారు. తీవ్రమైన గుండెపోటు కారణంగా ఏర్పడే కార్డియోజెనిక్ షాక్, తీవ్రమైన గుండె వైఫల్యం, తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం (ఏఆర్డీఎస్), ఊపిరితిత్తుల వైఫల్యం వంటి అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఎంపిక చేసిన రోగులకు ఎకమో చికిత్స ఎంతో కీలకమని వైద్యులు పేర్కొన్నారు. రోగి శరీరం కోలుకునేందుకు అవసరమైన సమయాన్ని అందిస్తూ, తదుపరి చికిత్సకు అవకాశం కల్పించే 'బ్రిడ్జి థెరపీ'గా ఎకమో ప్రాణాలను నిలబెట్టే వంతెనలా పనిచేస్తుందని వివరించారు. గుండె లేదా ఊపిరితిత్తుల మార్పిడి కోసం ఎదురుచూస్తున్న, మార్పిడికి సిద్ధమవుతున్న ఎంపిక చేసిన రోగులకు కూడా ఎకమో కీలకమైన మద్దతును అందించగలదన్నారు. ఎకమోలో ప్రధానంగా రెండు విధానాలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. వీఏ–ఎకమో (వినో–ఆర్టీరియల్ ఎకమో): గుండెతో పాటు రక్తప్రసరణ వ్యవస్థకు కూడా మద్దతు అవసరమైన సందర్భాల్లో దీనిని ఉపయోగిస్తారన్నారు. వీవీ–ఎకమో (వినో–వీనస్ ఎకమో): తీవ్రమైన ఊపిరితిత్తుల వైఫల్యం ఉన్నప్పటికీ గుండె పనితీరు తగినంతగా ఉన్న సందర్భాల్లో ఈ విధానాన్ని ఉపయోగిస్తారని వివరించారు. ఎకమో వంటి అత్యంత సంక్లిష్టమైన చికిత్సలో వైద్య నిపుణుల సమన్వయం అత్యంత ముఖ్యమని వైద్యులు పేర్కొన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో అనుభవజ్ఞులైన వైద్యులు, సర్జన్లు, క్రిటికల్ కేర్ నిపుణులు సమిష్టిగా పనిచేస్తూ రోగి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, కఠినమైన భద్రతా ప్రమాణాలు, ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళికతో పాటు శస్త్రచికిత్సకు ముందు, అనంతర సమగ్ర సంరక్షణ అందుబాటులో ఉందన్నారు. ప్రాణం చివరి అంచుకు చేరిన వేళ వైద్య విజ్ఞానం అందించే ఆశ... ఆగిపోతున్న శ్వాసకు అండ... అలసిపోతున్న గుండెకు తోడుగా నిలిచే ఆధునిక వైద్య సాంకేతికతే 'ఎకమో' అని వైద్యులు పేర్కొన్నారు. సరైన సమయంలో సరైన వైద్య సహాయం అందితే అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను కాపాడేందుకు ఆధునిక వైద్య రంగం కొత్త ఆశలను అందిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో యశోద మెడికల్ సెంటర్ ఆసుపత్రి మేనేజర్ ఎ. శ్రీధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ కె. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం..

# సంక్షేమమే మన ఆయుధం

## ప్రజల ఆశీర్వాదంతో వెయ్యి రోజుల విజయపథం.. పరకాలకు పూర్వ వైభవం తీసుకొస్తా..: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి





**పరకాల, సెప్టెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పరకాల పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కుంకుమేశ్వర దేవస్థానం, వెల్లంపల్లి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, హుజురాబాద్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆశీర్వాదమే ప్రభుత్వానికి కొండంత బలమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించామన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, అర్హులకు సీఎంఆర్ చెక్కులు, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ వంటి పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రైతులకు ఉచిత విద్యుత్ అందించామని, అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

### పరకాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

చారిత్రాత్మక పరకాల పట్టణానికి పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక డీపీఆర్ రూపొందించి మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పరకాలను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాస్క్ సెంటర్ వంటి సంస్థలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.



### బీఆర్ఎస్ పాలనపై విమర్శలు

తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. గత పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలు మర్చిపోవద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. "ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. గత పాలనలో ఏం జరిగింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు స్పష్టంగా తెలుసు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం.. ప్రజా సంక్షేమ పథకాలే మన ఆయుధాలు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం. పరకాల అభివృద్ధికి మరింత కృషి చేసి చారిత్రాత్మక పట్టణానికి పూర్వ వైభవం తీసుకొస్తా" అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు.

# కూతురి రాజకీయ భవితవ్యం కోసమే!

నేడు రాష్ట్ర రాజకీయాలు కొండా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అధిష్టానం ఎటువైపుగా అడుగులు వేస్తుందో అని ఉత్కంటగా ఎదురు చూస్తున్నారు. కానీ కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొండా సురేఖ రాజీనామా వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని, లేదంటే పార్టీ నుండి బర్తరఫ్ చేస్తామని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయటంతో కొండా కపుల్ రాజకీయ భవితవ్యం గందరగోళంలో పడింది. కూతురు చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ రాజకీయ జీవితాన్ని మార్చేస్తుంది అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. చాలా కాలంగా కొండా కపుల్ తమ కుమార్తె పొలిటికల్ ఎంట్రీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ బీఆర్ఎస్ లో ఉన్న సమయంలో కూడా కొండా సుస్మితకు టికెట్ కావాలని అధిష్టానం మీద ఒత్తిడి తెచ్చారు. కొండా సుస్మిత తన తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచనతో పరకాల నియోజకవర్గంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఇటీవల సీఎం రేవంత్ పరకాలలో మళ్ళీ టికెట్ రేవూరి ప్రకాష్ రెడ్డికే అని ప్రకటన చేయటంతో సుస్మిత ఆశలమీద నీళ్ళు చల్లినట్టు అయ్యింది. దీంతో పొలిటికల్ ఫ్యూచర్ పైన ఆందోళనలో ఉన్న కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. సీఎంపై సుస్మిత చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర అలజడి సృష్టించాయి. దీనితో కొండా సురేఖపై షోకాజ్ నోటీసు, పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌లు వచ్చాయి. అయితే కొండా దంపతులు తమ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాము బాధ్యులు కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని స్పష్టం చేశారు. వారు కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించలేదు. ఒకవేళ అదే చేస్తే కూతురికి రాజకీయంగా అనవసరపు ఇబ్బంది వస్తుందని, కూతురి కోసం పోరాటమే చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తల్లిదండ్రులు తమ బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం తమ పదవి, పార్టీలోని స్థానం, దశాబ్దాలుగా నిర్మించుకున్న రాజకీయ జీవితాన్ని రిస్క్ చేయటం మామూలు విషయం కాదు. కానీ కొండా దంపతులు ఈ రిస్క్ చేశారు. ఏదేమైనా ఎదో ఒక రచ్చతో నిత్యం ప్రజల మధ్యన హాట్ టాపిక్ గా నిలుస్తూ కొత్త రకం ప్రచారానికి తెర తీస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. మంత్రివర్గం నుండి కొండా సురేఖకు ఉద్వాసన పలుకుతున్న క్రమంలో కొండా దంపతుల రాజకీయ భవితవ్యంపైన చర్చ జరుగుతోంది. మొదట నుండి వివాదాస్పదులే అయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బలమైన కేడర్, వరంగల్ లో బలమైన పట్టు, ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని వారి అనుచరులు, శ్రేయోభిలాషులు చెబుతున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా వారు వ్యూహ రచన చేస్తున్నారని సమాచారం. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పుష్కలమైన ప్రజా మద్దతు, అంగబలం, ఆర్థిక బలం తమకు అనుకూలంగా ఉన్నాయని కొండా దంపతులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు కొనసాగుతున్నాయి. కొండా దంపతుల నిర్ణయం బీసీల ఏకీకరణకు ఇది మంచి అవకాశం అని వారి మద్దతుదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఈ చర్య దోహదపడుతుందని



అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు అవకాశం కల్పించి, వారిని గెలిపించుకునే వ్యూహంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. కోదండరామ్, కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు స్వంత వేదికల ద్వారా గుర్తింపు పొందినట్లే, దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా స్వతంత్రంగా ముందుకు రావాలనే ఆలోచన కొండా దంపతుల్లో ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి కొండా దంపతులు కొత్త రాజకీయ పార్టీ పెడితే వారి వెంట నడిచేవారు ఎందరు? వారు ఈ ప్రయత్నంలో సక్సెస్ అవుతారా అన్న చర్చ కూడా సాగుతుంది. అయితే, దీనిపై కొండా కుటుంబం నుండి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.